# మగని చెవిలో

"అనసూయ"

(రెండో పెళ్ళినిగురించి)

"అరదమునెక్కి కేతనపటాంచల
చంచలమైన తాల్మితో
తురగజవంబు మున్గడవద్రోసి
కడంగెడు తత్తరంబుతో
తిరుగెడు బండికండ్లపగిదిన్
భ్రమియించుమనంబుతోడ..."

ఏమిటండీ ఆ పద్యము! కృష్ణుడు సత్యభామ యింటికి వెళ్లుచున్నప్పుడు అతని మనస్సును గురించి వర్ణించి చెప్పినదా! నిజంగా అటువంటి మనుష్యులూ, అటువంటి మనస్సులూ ఉంటాయీ? ఆ కృష్ణుడికి యేమిపట్టిందండీ అంత భయపడి సత్యభామ యింటికి వెళ్లకపోతే! మిమ్మల్ని సలహా అడిగితే క్లబ్బుకువెళ్లి పొమ్మని చెప్పియుందురు గదా! కృష్ణునికి ఆపాటి బుద్ధి పుట్టలేదు. అందుచేత వెళ్లేడు, ఆ యిల్లాలిచేత తాపులు తిన్నాడు!

మన కృష్ణారావు నాటి కృష్ణునివంటివాడే!

అమగో! ఎవరైనా కొంచెము భార్యయెడల ప్రేమగా ఉంటే వాడికి ఏమీ చేతకాదనీ, ఆడారి వాడనీ, వాడికి పెళ్లాంవద్ద భయమనీ, అంటారు! మీకు లేకపోవడం సరేకదా, ఒకరివద్దనున్న సుగుణమైనా మాచి మెచ్చుకోలేరెందుచేత చెపుమా! పెళ్లాలు సావిత్రిలాగు ఉండాలి, సీతలాగు ఉండాలి అని మీరు చెప్పుచుండడం బాగుందీ! మేముమాత్రం మగవాళ్లు కృష్ణుని మోస్తరుగా రాముని మోస్తరుగా ఉండాలని కోరడం బాగులేదూ? అయినా మన దేశంలో ఆడవాళ్లని అన్యాయంగా అధఃపాతాళానికి అణిచేసేరు; దాని ఫలితము ఇక కొద్దిరోజులలోనే రాకమానదు లెండి! ఇప్పటికే పాశ్చాత్య సంపర్కంనించి మీ అధికారపు కట్టడములు కాలడం ప్రారంభించేయి! పూర్తిగా దగ్ధమైపోయేంతవరకూ మీరింకా మీ పాతస్వర్గంలోనే ఉన్నట్లు భావించుకుంటూ ఉండండి! మిమ్మల్ని యింట్లో కూర్చోబెట్టి పిల్లలను చూడండి అని చెప్పి మేము క్లబ్బులకు వెళ్లే రోజులు రాకపోవు లెండి! అప్పుడు తెలిపిస్తాము మీయొక్క కుటిలత్వమంతా! అప్పుడు మీచేత తినిపిస్తాము మీరు మాకు పెట్టిన కష్టములయొక్క ఫలములన్నీ! తెల్లవారిలేచిన దగ్గరనుంచీ నానా చాకిరీచేసి పిల్లలతో నానా బాధలూపడి మీఅమ్మా మీఅప్పా తిట్టిన తిట్లన్నీ తిని యేదో కొంచెం పెందలాడే పనులు తెరపచేసుకొని కూచుంటే, మీరు ఎక్కడో బాతాఖానీకివెళ్లి రాత్రి పదిగంటలవరకూ రాక కాలక్షేపము చేసివేయడమూ, నేను అలాగు పిట్టలాగు మీకోసము కనిపెట్టుకొని కూర్చోవడమూ, తరువాత పిల్లలు ఒక నిద్రతీసి మళ్లీ నా పీకలమీదికి సవారీ అయిపోవడమూ—ఇలాగు నేను ఇన్నిబాధలు పడుతూఉంటే మీకు చీమకుట్టినట్లైనా ఉందీ? చాకలిమూటలు మోయడానికి గాడిదెలాగు మేము ఇవన్నీ అనుభవించడానికే పుట్టేమని కాబోలు మీ తాత్పర్యము! చిన్నప్పుడు పెళ్లిలో మెడమీద పూజా పెడితే యేమిటో హాస్యాని కనుకొన్నాను గాని యింత నిజముగా యెద్దుపూజలాగు ఉంటుందని అనుకోలేదు. జయపురం ఘాటీలమీద బరున్న లాగు

కొనిపోయే యెద్దులలాగు మేము యీ సంసారాన్ని మోసితీసికెళ్లడానికి దేవుడు మాకు రానేడు కాబోలు! పోనీ, ఎంతబరువైనా మోయవచ్చును. ఎన్నిపాట్లైనా పడవచ్చును. 'నా' అన్నవాళ్లుంటేను! కాని అలాంటి వారేరీ? చూచి సంతోషించేవారు లేరే! చేసినపనీ, పడినకష్టమూ, అంతా అడివిగాచిన వెన్నెల అయి పోతూఉంటే, చింకిజేబులో ధనం పోసినట్లు కారి పోతూవుంటే, మరి ఏక్త్సారా, సంతోషమూ, ఉత్సాహమూ ఉంటాయి చెప్పండి! మీరైనా ఒక మాటు కొకమాటు కష్టసుఖాలు ముచ్చటిస్తూ ఉంటే, ఇంత మనోవ్యథ, ఇంత దుఃఖము నా కుండదుగదా! కాని అందుకు మీకు ఆసక్తిలేదు. తీరుబాటులేదు క్లబ్బుకు ధారపోసే అయిదు గంటలలో రెండు గంటలు తగ్గిస్తే ఏం తుపానులు పెట్టేస్తాయా, కళ్లు కొట్టేస్తాయా, భూకంపాలు పుట్టిపోతాయా! లేక మీ స్నేహితులకు మతులుపోతాయా, మీకు వెర్రెత్తి పోతుందా? ఆ రెండుగంటలసేపూ యింట్లో కూర్చొని పిల్లలిని చూస్తూ నాకు చేయూతగాఉంటే నాప్రాణం ఎంత సంతోషిస్తుంది! అలాంటిబుద్ధి మీకు పుట్టితే! నావంటి మంచివాళ్లు ఉన్నంతకాలం ఇలాగు కళ్లు కానకతిరుగుతారు, తరువాత మీపాట్లు కుక్కలుపడవు! నావిలువ మీకు యిప్పుడు తెలియదు! ఎలాగూ నాకు మూడు నాలుగేళ్లలో మార్కం ఉందని జ్యోతిష్కుడు చెప్పేడుట గదూ! అప్పుడు మీరు తిరిగీ పెళ్లాడాలి—మీకు నాయొక్క మంచి చెడ్డలు అప్పుడు బోధపడాలి! మరి పెళ్లాం వస్తేనేగాని తొలిపెళ్లాం గుణాలు బోధపడవు. దాని ధాకకు ఆగలేక క్లబ్బు యెటువంటిదో నెలకు ఒక మారైనా చూడక, నిత్యమూ పిల్లల యేడుపులు చెవులో ఓంకారశబ్దములాగు వినబడుతూఉంటే, మీరు ఆ రెండోపెళ్లాంవద్ద భయభక్తులుగల్గి భృత్యతగా సంచరిస్తూ ఉన్నప్పుడు నాకు చూడాలని మహా కోరికగా ఉంది! వీలైతే దెయ్యమునైనాఅయి ఈ యింటిలో ప్రవేశించి చూడకపోను లెండి! అప్పుడు ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా "పోయిన అనసూయ మంచిది; దానిని నిష్కారణం బాధపెట్టేను; ఇప్పుడు ఈ జాంబవతివచ్చి నా ప్రాణాలు పుచ్చుకుంటూ ఉన్నది; క్లబ్బుకూ వాచిపోయినాను, వంటపొగంతా నా కళ్లలోనూ ముక్కులోనే ఉంటూ ఉన్నది; తోటి స్నేహగాండరూ వారి యిష్టంవచ్చినట్లు కథలల్లి నాగురించి కూస్తూఉన్నారు! ఏమైనా దీన్ని ఎదిరించి అన్నానంటే నిజమైన జాంబవతిలాగే బరికేసి రవ్వపెట్టి నా పరువంతా బయటపెట్టేస్తుందేమో అని భయమువేస్తూఉంది!" అని ప్రతి నిమిషమూ మీరు గింజుకుంటూఉంటే, మీ జాంబవతి మీపైని ముఖము చిట్లిస్తూఉంటే చూచి, "ఏమండీ! నేను అన్నది నిజమైందా?" అని అడగాలని ఉంది.

అందుచేత ఏదో నేను బ్రతికిఉంటే యీ కొన్నాళ్లూ నన్ను సుఖపెట్టండి, మీరు సుఖపడండి! 'నా' అన్నవాళ్లు లేక తహతహలాడిపోవుచున్నాను! మీ దర్శనము హైదరాబాదు నవాబుగారి దర్శనములాగు అపురూపమైపోయి, మీ అమ్మగారూ మీ అప్పగారూ నన్ను మాలదాన్ని చూసినట్లు చూస్తూ ఉండి కాల్చుకొని తింటూఉంటే, ఎందుకండీ యీ పాడుబ్రతుకు! మీ పిల్లలిని మీరే పెంచుకోండదురు గాని, లేకపోతే మీ రెండోపెళ్లామూ మీ అమ్మా అప్పా పెంచుతారు! నా కెందుకు ఈ చిత్రశోభ? ఈ మూడు నాలుగేళ్లూ ఎలాగో కళ్లు మూసుకుంటే నాకు మార్కము రానేవస్తుంది, మీ కోరిక తీరనే తీరుతుంది! నాబాధ అంతమవనే అవుతుంది!........

నా మార్కంఅంటే ఎందుకండీ అంత సంతోషం మీకు? ముఖం వికసించిపోయింది తామరపద్మంలాగు! సంబరం దాచుకోలేకుండా ఉన్నారు! అలాగే కానివ్వండి! యీ సంతోషమంతా రెండోపెళ్లాము వచ్చిన తరువాత చూద్దాము! నాన్నకు పెళ్లి అవుతుందని సందడేగాని సవతితల్లి వస్తుందని జ్ఞానములేనట్లు

జాంబవతిమాట మరచిపోకండి! జాంబవతి మీ యింటిలో కాలు పెట్టినతరువాత మీయింటివద్ద లోపలా పైనాకూడా అలికిరిగానే ఉంటుంది లెండి! యింటిలోపల ఆమె మీపైని రణగుణధ్వని చేస్తుంది! అప్పుడు ఎన్ని చిత్రాలు, ఎన్ని తమాషాలైనా జరుగుతూ ఉంటాయి లెండి! రెండో పెళ్లి అనుభవం ముందున్నది లెండి! రెండూ పెళ్లిచేసుకోరూ? ఎరిగీ మరిచీ మరిపెళ్లాడరూ? దానికేమి! ఈ కబుర్లు అందరూ మామూలుగా చెప్పేవే! ఎదురుగుండా మనిషంత మనిషి పెళ్లాం దెయ్యంలాగు నిలబడితే నేను తిరిగీ పెళ్లిచేసుకుంటానని అనడానికి ఏమగడైనా జంకుతాడు. కేవలం భయమని కాదుగాని ముఖం మెప్పక! నేను గతించిన పదమూడో రోజున మీరు పెళ్లి సెటలుచేసుకొని పల్లకీ యెక్కక పోరు! పెళ్లాడకపోతే శక్తిలోపం అనుకుంటారేమోనని జిజ్ఞాస! నా మొదటిపెళ్లాం వొట్టువేయించుకుందనో లేకపోతే మాఅమ్మ నూతిలోపడతానంటూ ఉన్నదనో, పిల్లలకు సంరక్షణలేదనో, ఏదో ఒక నెపం సంకల్పించుకొని పెద్దబ్బాయి చేయూతపుచ్చుకొని ఎలాగో బాజాలతో పల్లకీయెక్కిపోతారు! చూపుకి వద్దూవాడుగా ఉన్నారు! పేరుకి ప్లీడరు! మరేమిటి కావాలి! ఇక లోపలసంగతా? అది పెళ్లికూతురే తరువాత తెలుసుకొని తగినప్లాను వేసుకుంటుంది! ఆ తరువాత మీ ప్రాయశ్చిత్తం మీకు అవుతుంది! అప్పుడు నేను జ్ఞాపకం రాకపోనులెండి! ఆతరువాత సంగతి నా కెందుకు. నేను బ్రతిమాలుకొన్నట్లు నాకు దేవుడిచ్చిన యీ మూడు నాలుగేళ్లూ మాత్రము వృథాపోనివ్వకండి! ప్లీడరు పని పాపానికితోడు పెళ్లాం ఉసురుపోసుకొన్న పాపంకూడా మెడగట్టుకోకండి! ఏదో ముఖం మెప్పకైనా, పెదవులకు బెల్లం రాసుకొని అయినా, నాతో పూర్వమువలె—అనగా—మీరు చదువుకొంటూఉన్న రోజులలోవలె అభిమానముగా రెండు తీపిమాటలు మాట్లాడండి! క్లబ్బు రెండుగంటలు తగ్గించండి! ఇది ఇల్లూ, ఇది పెళ్లామూ అని ఒంటిమీద కొంచెం చైతన్యం ఉంచుకొండి! దానివల్ల మీభాగ్యమేమీ తరిగిపోదు! మీ గౌరవానికేమీ లోపమురాదు! మీకు సరివారిలో తలవంపులు రావు! నన్ను చులకనచేసి క్షోభపెట్టినంతమాత్రముచేత మీకు రావుబహద్దరు, దివానుబహద్దరు, కితాబులు వచ్చి పడిపోవు, మీరు పెద్ద చక్రవర్తులైపోరు! కాబట్టి అగ్నిసాక్షిగా పెళ్లాడిన మోహమూ, ఇన్నాళ్లూ కలసిమెలసిఉన్న స్నేహమూ, ఇవి తలచియైనా నాయందు కొంచెం గౌరవం వుంచండి! అంతే నేను కోరేది!

---

ఒక పత్రికావిలేఖరి. "ఫలానా ఘరానామనిషి ప్రియభర్తను, కూర్మిసంతానాన్ని, దగ్గరిచుట్టాల్ను విడచిపెట్టి ఫలానాదినం స్వర్గస్థురాలైందని వ్రాయుటకు చాలా చింతిస్తున్నాము"

ఈవిలేఖరిగారు చింతించేది దేనికో!